బస్తా బియ్యం.. నయా మోసం



బియ్యం బస్తాల గోదాము

చిత్తూరు నగరంలో బుధవారం తూనికలు కొలతల అధికారులు ఆకస్మికంగా ఓ బియ్యం దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. దీంతో బియ్యం బ్యాగుల తూనికల్లో తేడాలొచ్చాయి. అధికారులు తూకం వేస్తే 26 కేజీల బస్తాలో 25 కేజీలు బియ్యం ఉండడంతో కేసు నమోదు చేశారు. ఈ దుకాణంలో మాత్రమే కాదు. చాలా దుకాణాలో ఇదే తంతు కొనసాగుతోంది. పేరున్న బ్రాండెడ్ సంచుల్లో ఇలాగా తక్కువ తూకాలు, నాసిరకం బియ్యం నింపేసి జనాన్ని దోచుకుంటున్నారు. జిల్లా కేంద్రంగా సాగుతున్న ఈ దందాపై అధికారులు దృష్టి సారించారు.

- 26 కిలోల సంచుల్లో నింపేది 25 కిలోలే
- బ్రాండెడ్ రంగులు వేసి ప్రజలకు మస్కా
- చిత్తూరు కేంద్రంగా సాగుతున్న దందా



బుధవారం చిత్తూరులో బియ్యం దుకాణం తనిఖీ చేస్తున్న తూనికలు కొలతల ఇన్‌స్పెక్టర్

చిత్తూరు రూరల్: జిల్లా కేంద్రంలో నాసిరకం బియ్యంతోపాటు తూకం దందా విచ్చలవిడిగా సాగుతోంది. నగరంలో వీధి..వీధికి బియ్యం దుకాణాలు వెలుస్తున్నాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం ఆర్జించవచ్చని ఎక్కువ మంది బియ్యం వ్యాపారాన్ని ఎంచుకుంటున్నారు. ఈ కారణంగానే నగర, పరిసర ప్రాంతాల్లోనే 945కు పైగా బియ్యం దుకాణాలు వెలిశాయి. వీటిల్లో రోజుకు రూ.10 లక్షల నుంచి 20 లక్షల వరకు వ్యాపారం జరుగుతోందని అంచనా. గతంలో గోదావరి, నెల్లూరు జిల్లాల నుంచి అధికంగా బియ్యం బస్తాలను రవాణా చేసుకుని ఇక్కడ వ్యాపారం సాగించేవారు. అయితే ఇప్పుడు ప్రధానంగా అలాంటి బ్రాండెడ్ సంచుల్లో ఇక్కడి బియ్యం నింపి దందా చేస్తున్నారు.

తూకాల్లో మోసం...

ప్రస్తుతం మార్కెట్లో విక్రయిస్తున్న సంచులపై 26 కేజీలుగా ముద్రిస్తున్నారు. అదే నిజమని జనం నమ్ముతున్నారు. అయితే ఆ బ్యాగుల్లో వ్యాపారులు 25 కిలోల బియ్యం నింపుతున్నారు. ఇలా రోజువారీగా పెద్ద పెద్ద వ్యాపారులు లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ఇక 26 కేజీలకు జీఎస్టీ అంటూ అదనంగా గుంజుతున్నారు. పేరున్న బ్రాండెడ్ బియ్యం బస్తా గతంలో రూ. 1000, రూ.1,100కు వచ్చేది. ఇప్పుడు జీఎస్టీ పేరు చెప్పి రూ.1400కు పైగా వసూలు చేస్తున్నారు. వీటికి జీఎస్టీతో కూడిన బిల్లులు ఇవ్వాల్సి ఉంది. కానీ ఏ దుకాణంలలోనూ బిల్లులు ఇవ్వరు. కాగితం మీద రాసి ఇస్తుంటారు. మరో వైపు తూకాల్లో కూడా దోచేస్తున్నారు. ఇక చాలా దుకాణాలల్లో పాత కాలం కాటాతో తూకం వేస్తున్నారు. ఈ తూకల్లో బియ్యం బస్తాను పెట్టినట్టే పెట్టి తక్కుమని తీసేస్తుంటారు. చాలా మందికి పాత కాలం కాటలో తూకంపై అవగాహన లేదు. మరికొన్ని దుకాణాల్లో తూకం వేయకుండానే బ్యాగులను సర్దేస్తుంటారు. ఇంకొన్ని చోట్ల ఎలక్ట్రానిక్ మిషన్లో కూడా చేతివాటం ప్రదర్శిస్తున్నారు.

సన్నబియ్యం పేరుతో దందా

తూర్పుగోదావరి, నెల్లూరు జిల్లాల నుంచి చిత్తూరుకు బియ్యం రవాణా చేసుకుంటారు. ఇలా కొంత వర కు తెప్పించుకుని మిగిలిన సంచులకు అదే రంగులు వేసి, నాసిరకం బియ్యం నింపేస్తున్నారు. రేషన్ బియ్యాన్ని రూ.9కే కొనుగోలు చేస్తున్నారు. వాటిని సన్నబియ్యంగా మార్చి బ్రాడెండ్ అంటూ అమ్మేస్తున్నారు. ఈ మధ్యకాలంలో ఈ రకమైన దందా ఎక్కువైంది. చిత్తూరులో ఎక్కువగా బుల్లెట్ రైస్, లక్ష్మీ బ్రాండ్, ఆహార్, ఆపిల్, జోకర్ వంటి బ్రాండ్‌లు అధికంగా విక్రయిస్తున్నారు. ఈ రకమైన బ్యాగులు, సొంత బ్రాండ్ పేరుతో మరి కొన్ని బ్యాగులు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ బ్యాగుల్లో సన్నబియ్యంగా మార్చుకున్న రేషన్ బియ్యాన్ని నింపి ప్రజలకు బస్తా రూ.1,200 చొప్పున విక్రయిస్తున్నారు. సంచిపైన ఒరిజినల్ సీల్, లేబుల్స్ ఒకేరకంగా కనిపిస్తుంటాయి.

నిఘా పెడుతున్నాం



రేషన్ బియ్యాన్ని చాలా చోట్ల వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని మా దృష్టికి వచ్చింది. అలా కొనుగోలు చేయడం నేరం. విచారణలో నిజమని తేలితే కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే పలు చోట్ల అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేశాం. ఈ దందాపై ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు పూర్తి స్థాయిలో నిఘా పెట్టాం. రేషన్ బియ్యాన్ని సన్నబియ్యంగా మార్చి అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు.

– శంకరన్, డీఎస్‌ఓ, చిత్తూరు

క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉచిత కంటి వైద్య శిబిరంలో పరీక్షిస్తున్న వైద్యులు

యాదమరి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చెన్నై ఎంఎన్ ఆస్పత్రి వైద్యులతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 84 మందికి పరీక్షలు చేయించుకోగా, 26 మందికి ఆపరేషన్లు అవసరం ఉందని గుర్తించారు. వీరిని ఆస్పత్రి వారి వాహనంలో చెన్నై ఎంఎన్ ఆస్పత్రికి ఉచితంగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు పెరియంబాడి నాగరాజు, వైద్యులు పాల్గొన్నారు.

గాలులకు కూలిన చెట్టు



ఏఏఓ కార్యాలయంపై కూలిన చెట్టు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో బుధవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు గిరింపేట ట్రాన్స్‌కో రూరల్ అసిస్టెంట్ అకౌంటెంట్ కార్యాలయం (ఏఏఓ)పై చెట్టు కూలిపోయింది. ఆ స మయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రా ణ నష్టం తప్పిపోయింది. అయితే కార్యాల యం పైకప్పు దెబ్బతింది. తీగలు తెగిపోవడం వల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో పాటు స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వెను క వైపు కూడా మరో చెట్టు పడిపోయింది.

సచివాలయాల్లో నగదు రహిత చెల్లింపులు



నగదు రహిత చెల్లింపులు ప్రారంభిస్తున్న అధికారులు

గుడిపాల: సచివాలయాల్లో ఇకపై నగదు రహి త చెల్లింపులు నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీల విస్తరణాధికారి కృష్ణప్రసాద్ అన్నా రు. వసంతాపురం గ్రామ సచివాలయంలో గురువారం నగదు రహిత సేవలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇకపై సచివాలయాల్లో నగదు రహిత సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలియజేశారు. ప్రజలు కూడా డిజిటల్ సేవలకు అలవాటు పడ్డారని గుర్తుచేశారు. ఆగస్టు 15వ తేదీ నుంచి అన్ని సచివాలయాల్లో పూర్తి స్థాయిలో డిజిటల్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

చిత్తూరు కార్పొరేషన్: గ్రంథాలయ సేవలను పాఠకులు వినియోగించుకోవాలని ఉపగ్రంథాలయాధికారి లావణ్య తెలిపారు. స్థానిక సీఆర్ రెడ్డి గ్రంథాలయంలో గురువారం పాఠకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రంథాలయాలకు కొత్త పుస్తకాలు వచ్చాయని చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పన పనులతోపాటు, ఖాళీ పోస్టుల భర్తీకి కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు లలిత, మధు, గజేంద్రబాబు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: నగరంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో వన్‌టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి వివరాలపై ఆరా తీశారు. ఎలాంటి సమాచారం అందకపోవడంతో మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిస్తే, స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు పేర్కొన్నారు.

మౌలిక వసతులపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని ఎంపీడీఓ గౌరి సూచించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ గౌరి మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా గ్రామంలోని మరుగుదొడ్లు, తాగునీరు, డ్రైనేజీ, సంక్షేమ పథకాలపై పంచాయతీ కార్యదర్శులు నివేదిక అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ మంజునాథ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంతర పంటలతో ఆదాయం

తవణంపల్లె: రైతులు అంతర పంటలు సాగు చేయడం లాభదాయకమని వ్యవసాయాధికారి జి. ప్రవీణ్ తెలిపారు. మండలంలోని వెంగంపల్లెలో సాగు చేసిన వేరుశనగ పంటను గురువారం ఆయన పరిశీలించారు. వేరుశనగలో అంతర పంటగా రాగి, పెసర, కందులు సాగు చేయాలని సూచించారు. దీని కోసం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు.

వీఐపీ దర్శనాలు పరిమితం

సాక్షి ఎఫెక్ట్..

కాణిపాకం(యాదమరి): ప్రోటోకాల్, ఉభయదారులకు మాత్రమే వీఐపీ గేట్‌లో స్వామివారి దర్శనాలు కల్పించాలని మిగిలిన వారికి అను మతులు లేవని ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. 'అంతరాలయ దర్శనం అస్తవ్యస్తం' అనే శీర్షికన 'సాక్షి'లో గురువారం వెలువడిన కథనంపై ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్పందించారు. ఉదయం వారు ఆలయంలో వీఐపీ గేట్ వద్దకు వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది, హోమ్‌గార్డులు ఎవరెవరిని దర్శనాలకు పంపుతున్నారో.. అంతరాలయ దర్శనం ఎంత మందికి కల్పిస్తున్నారో ప్రత్యక్షంగా ఆరా తీశారు. అనంతరం హోమ్‌గార్డుల ఇన్‌చార్జ్ వినాయకం, ఆలయ అధికారులతో మాట్లాడుతూ ప్రోటోకాల్ దర్శనాలు, ఉభయదారులకు వీఐపీ గేట్ వద్ద దర్శనాలకు అనుమతించాలని సూచించారు. మిగిలిన వారిని ఎవరినీ అనుమతించరాదని సూచించారు. ఎవరైనా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాగి సాగుపై అవగాహన



రాగిపంటను పరిశీలిస్తున్న హబీబ్‌బాషా

గుడిపాల: రాగిపంట సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ డెప్యూటీ డైరెక్టర్ హబీబ్ బాషా తెలిపారు. నారగల్లు సచివాలయంలో గురువారం అగ్రికల్చర్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరిపంటకు బదులుగా రైతులు రాగిపంట వేసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించాలని చెప్పారు. రాగులు రైతులకు 50శాతం సబ్సిడీతో అందించనున్నట్లు తెలిపారు. రైతుల నుంచి ప్రభుత్వమే కిలో రాగులను రూ.38కి కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. అనంతరం వెంగమాంబపురం, సీఎం కండ్రిగ గ్రామాల్లో రైతులు వేసిన రాగిపంటను ఆయన పరిశీలించారు. ఎనిమిదేళ్లలోపు ఉన్న మామిడి తోటల్లో కూడా రాగిపంటను అంతర పంటగా వేసుకోవచ్చని సూచించారు. ఆయనతో పాటు ఏడీఏ మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయాధికారి మాధవిలు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల నిరసన

యాదమరి: సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏలు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు తమ నిరసన కార్యక్రమం చేపట్టారు.

జాతీయ స్థాయికి పూతలపట్టు బాలికలు



ఎంపికైన బాలికలతో ఉపాధ్యాయ బృందం

పూతలపట్టు: జాతీయ స్థాయి టగ్-ఆఫ్ -వార్ పోటీలకు పూతలపట్టు ఉన్నత పాఠశాల బాలికలు ఎంపికై నట్లు హెచ్‌ఎం చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన బాలికలు ఈ నెల 21 నుంచి 24 వరకు తమిళనాడులోని ఈరోడ్ సమీపంలో నిర్వహించే సబ్‌జూనియర్, జూనియర్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అండర్-15 సబ్ జూనియర్ జట్టులో నినిష, నిహిత, మెనిల్ల, నిషిత, హరిత, ఉదయశ్రీ, పవిత్ర, అండర్ -17 సబ్ జూనియర్స్ జట్టులో అఖిల, మధురిమ, జయశ్రీ, సుభాషిణి, జాహ్నవి, మేఘన, భవ్య, తేజశ్రీ ఉన్నారు. వీరిని ఇన్‌చార్జి హెచ్‌ఎం విశ్వనాథరెడ్డి, మోహన్‌రెడ్డి, పీటీ క్రిష్ణ, ఢిల్లీరాణి అభినందించారు.

'ఇంద్రధనుస్సు'ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి సురేఖ

యాదమరి: మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంతగేటు వైద్యాధికారి సురేఖ కోరారు. మండలంలోని సంతగేటు ప్రభుత్వాస్పత్రిలో గురువారం ఏఎన్‌ఎంలకు, ఆశ కార్యకర్తలకు ఆమె ఇంద్రధనుస్సుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల వారీగా ప్రతి ఇంటినీ సందర్శించి అందులో ఐదేళ్ల లోపు పిల్లలను గుర్తించాలన్నారు. వారిలో ఎవరైన వ్యాధి నిరోధక టీకాలు వేసుకోకుంటే, వారికి టీకాలు వేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఇటుక బట్టీల వద్ద, కోళ్ల ఫారాలలో పనులు చేయడానికి బయట రాష్ట్రాల నుంచి కుటుంబాలు వలస వచ్చి ఉంటాయని చెప్పారు. వారి ఇళ్లలో చంటి పిల్లలు ఉంటే వారికి వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు విశిష్ట సేవలు

చిత్తూరు అగ్రికల్చర్: ఖాతాదారులకు బ్యాంక్ ఆఫ్ బరోడా విశిష్ట సేవలు అందిస్తోందని ఆ బ్యాంకు చిత్తూరు ప్రధాన శాఖ మేనేజరు నాగేంద్రుడు అన్నారు. బ్యాంకు 116 వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం నగరంలోని కట్టమంచి చెరువు కట్ట మీద 116 మొక్కలు నాటే కార్యక్రమాన్ని బ్యాంకు సిబ్బంది చేపట్టారు. కార్యక్రమంలో కట్టమంచి బ్రాంచి మేనేజరు శ్రీధర్‌నాథ్ పాల్గొన్నారు.

పేదలందరికీ ఫ్యామిలీ డాక్టర్ సేవలు





ఐరాల: వైద్య శిబిరంలో డాక్టర్ పూర్ణలత, యాదమరి: శిబిరాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతి

బంగారుపాళెం: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా మారుమూల గ్రామాల్లోని నిరుపేదలందరికీ వైద్య సేవలను అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి తెలిపారు. మండలంలోని ముంగరమడుగు గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. శిబిరానికి వచ్చిన వృద్ధులు, గర్భిణులు, బాలింతలతో ఆమె మాట్లాడారు. సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని గుర్తు చేశారు. క్యాంప్‌కు రాలేని రోగులకు ఇంటివద్దే వైద్య సేవలు అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎపిడిమాలజిస్ట్ వాణి, వైద్యాధికారి రమేష్, ఎంపీహెచ్‌ఈఓ రమేష్‌బాబు, ఏఎన్‌ఎం వాణి, ఎంఎల్‌హెచ్‌పి ఆశ, 104 సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమందపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని నెల్లిమందపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత గురువారం 104 వైద్య శిబిరంలో 65 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



తవణంపల్లె: వైద్యం చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

గర్భిణుల్లో రక్తహీనత నివారణకు కృషి

తవణంపల్లె: గర్భిణుల్లో రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి వినయ్‌కుమార్ సూచించారు. ఆయన గురువారం మండలంలోని ఎ.గొల్లపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా చేసుకోవాలని, అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్‌తో పేదలకు ఇంటి దగ్గరకు వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు.

అర్హులకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు



పూతలపట్టు: పి.కొత్తకోటలో ప్రజలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు

పూతలపట్టు: అర్హతే ప్రామాణికంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కుతుందని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గురువారం మండలంలోని వావిల్‌తోట, పి.కొత్తకోట పంచాయతీలలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు 99 శాతం అర్హులకు అందించినట్లు వెల్లడించారు. మిగిలిన ఒక్క శాతంలో అర్హులు ఉంటే జగనన్న సురక్ష ద్వారా మేలు చేకూరుస్తామని స్పష్టం చేశారు. అనంతరం పి.కొత్తకోటలో 826, వావిల్‌తోటలో 1207 సేవల సర్టిఫికెట్లను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్ రెడ్డి, సర్పంచ్ సంఘ అధ్యక్షులు జయచంద్రారెడ్డి, రాజారత్నంరెడ్డి, జెడ్పీటీసీ దేవిక, వైస్‌ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, మురళి, స్థానిక సర్పంచులు పద్మజారాణి, మహేశ్వరి, ఎంపీటీసీ దేవిక, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, పంచాయతీ కార్యదర్శులు జరీనాబేగం, రాజా తదితరులు పాల్గొన్నారు.

280 మందికి సర్టిఫికెట్లు

బంగారుపాళెం: మండలంలోని మొగిలివారిపల్లె సచివాలయంలో 280 మందికి 11 రకాల సర్టిఫికెట్లను ఎమ్మెల్యే, అధికారులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ శ్యామల, మండల అధికారులు పాల్గొన్నారు.

142 మందికి ధ్రువపత్రాలు

చిత్తూరు రూరల్: మండలంలోని చింతలగుంట సచివాలయంలో 142 మందికి కుల, 137 మందికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి అందించారు. 37 మందికి ఆధార్‌కు మొబైల్ నంబరు అనుసంధానం చేసుకున్నారు.

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో 345 మందికి, వెంగంపల్లెలో 347 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సి.హరిరెడ్డి, నాయకులు శ్రీరాములురెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, మధుకుమార్, పాలాక్షిరెడ్డి, గిరిరెడ్డి పాల్గొన్నారు.

600 మందికి సర్టిఫికెట్ల పంపిణీ

గుడిపాల: మండలంలోని మరకాలకుప్పం, తిమ్మయ్యపల్లె సచివాలయంలో మండల స్పెషలాఫీసర్ మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న 11 రకాల సేవలను వివరించారు. అనంతరం 600 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, ఆర్ఐ రమాసాయి పాల్గొన్నారు.





తవణంపల్లె: టి పుత్తూరులో సర్టిఫికెట్ల పంపిణీ, గుడిపాల: సర్టిఫికెట్ అందిస్తున్న మండల స్పెషలాఫీసర్

సంక్షేమ సారథిని మరోసారి దీవించండి





చిత్తూరు: పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, బంగారుపాళెం: ఇళ్ల పట్టాలను అందజేస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

చిత్తూరు కార్పొరేషన్: దేశంలోనే ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిన జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. నగరంలోని 45వ డివిజన్ మంగసముద్రం హరిజనవాడలో గురువారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం కోసమే ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు మన రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. విద్య, వ్యవసాయ రంగాల్లో గతంలో ఎన్నడూ లేని అభివృద్ధిని సాధిస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీకి వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని విమర్శించారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నట్లు గుర్తుచేశారు. వీటితోపాటు రాజకీయ రంగంలో సైతం మహిళలు రాణిస్తున్నారని చెప్పారు. ఇందిరానగర్‌లో డ్రైనేజీ లేకపోవడంతో వర్షం పడినప్పుడు నీరు రోడ్డుపై నిల్వ చేరి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని స్థానికులు తెలిపారు. మంగసముద్రం, పాతబ్రాహ్మణ వీధిలో నీటి సమస్యను పరిష్కరించాలని, వీధి కొళాయిలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు. అదే విధంగా వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. సంబంధిత సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి శివారెడ్డి, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్ నాయకులు నారాయణ, గోపి, దేవా, ప్రకాష్, రమేష్, సీతాపతి తదితర నాయకులు పాల్గొన్నారు.


అర్హులందరికీ పథకాలు

బంగారుపాళెం: రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని పాలేరు గ్రామ సచివాలయం పరిధిలోని దిగువ బందార్లపల్లె, పాలేరు, దళితవాడ, ఎస్టీ కాలనీ గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను, ఇప్పటివరకు ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. మురికినీటి కాలువలు, వీధిలైట్లు, తాగునీటి పైప్‌లైన్ సౌకర్యం కల్పించాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్టీ కాలనీలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వంలో అర్హులకు సంక్షేమ పథకాలు అందేవి కాదని గుర్తుచేశారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనలో రాజకీయాలకతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను ఇళ్ల వద్దకే అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ప్రజలు ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, స్థానిక సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఫిరోజ్ అహ్మద్, వడ్డెర, కురబ కార్పొరేషన్ డైరెక్టర్లు మొగిలీశ్వర, అమరనాథ్, జిల్లా పార్టీ కార్యదర్శి శరత్‌రెడ్డి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసన్నకుమార్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, మండల పార్టీ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రఘుపతిరాజు, నియోజకవర్గ మైనారిటీ సెల్ కార్యదర్శి సుహేల్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు నాగరాజ, అధికారులు పాల్గొన్నారు.

నేడు మొగిలి వెంకటగిరిలో..

మండలంలోని పాలేరు గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే ప్రజా సమస్యలను తెలుసుకునే ఈ కార్యక్రమం ఉదయం 6.30 గంటలకు ప్రారంభం అవుతుందని చెప్పారు.

నూతన ఎస్‌ఐగా సురేష్



పూతలపట్టు: మండలానికి నూతన ఎస్‌ఐగా సురేష్‌ను నియమిస్తూ ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన చిత్తూరు వీఆర్ నుంచి పూతలపట్టుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న హరిప్రసాద్ పలమనేరు ఎస్‌ఐగా బదిలీ అయ్యారు.

బీఎల్వోల పాత్ర కీలకం

చిత్తూరు కలెక్టరేట్ : ఓటరుజాబితా కసరత్తులో బీఎల్వోల పాత్ర కీలకమని ఆర్డీవో రేణుక అన్నారు. గురువారం నగరంలోని అంబేడ్కర్ భవనంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఓటరుజాబితా కసరత్తు పకడ్బందీగా చేపట్టాలన్నారు. అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

లారీ బ్రేక్ ఫెయిల్ -తప్పిన ప్రమాదం



యాదమరి: చిత్తూరు-గుడియాత్తం రహదారిపై కాశిరాళ్ల వద్ద గురువారం రాత్రి వేగంగా వెళుతున్న లారీకి బ్రేక్ ఫెయిల్ అయింది. డ్రైవర్ చాకచక్యంగా క్రమంగా వేగం తగ్గిస్తూ రోడ్డుపైనే ఆపేశాడు. అయితే రాత్రి వరకు అక్కడి నుంచి లారీని కదిలించకపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.